సాక్షి
జోగులాంబ గద్వాల

సోమవారం, 30, అక్టోబర్, 2023



తెరుచుకున్న ఆలయాలు

చంద్రగ్రహణంతో మూతబడిన ఆలయాలు ఆదివారం ఉదయం తెరుచుకున్నాయి.

వివరాలు 12లో ▸



అట్టహాసంగా..

ఆత్మకూరులోని మూలమల్లలో ఆలిండియా ఇన్విటేషన్ కబడ్డీ పోటీలు ప్రారంభమయ్యాయి.

వివరాలు 12లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
33.1 /23.3

రోజంతా ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది. అప్పుడప్పుడు ఆకాశం మేఘావృతమవుతుంది. సాయంత్రం చలి తీవ్రత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

నేటి నుంచి జీవాలకు ఉచితంగా టీకాలు

అయిజ: గొర్రెలకు, మేకలకు **పారుడు రోగం** రాకుండా ప్రభుత్వం ఉచితం**గా టీకాలు వేయి**స్తుందని వెటర్నరీ అసిస్టెంట్ **సర్జన్ స్వరూప**రాణి తెలిపారు. ఈ నెల **30వ తేది నుంచి** నవంబర్ 20వ తేది వరకు **షెడ్యూల్ ప్రకారం** గ్రామాల వారీగా పశువులకు టీకాలు వేయనున్నట్లు పేర్కొన్నారు. ఈనెల 30న వెటర్నరీ సిబ్బంది యాపదిన్నె గ్రామంలో గొర్రెలు, మేకలకు టీకాలు వేయనున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా పెంపకందారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ప్రతి గొర్రె, మేకలకు టీకాలు ఇప్పించాలని కోరారు.

బీచుపల్లి ఆలయంలో ఉత్తరాది పీఠాధిపతి



ఎర్రవల్లిచౌరస్తా: ఎర్రవల్లి మండలంలోని బీచుపల్లి ఆంజనేయస్వామి ఆలయాన్ని ఆదివారం ఉత్తరాది మఠం పీఠాధిపతి సత్యాత్మ తీర్థ శ్రీపాదులు సందర్శించారు. ఈ సందర్భంగా ఆంజనేయస్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకు ముందు ఆలయ సిబ్బంది ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ప్రధాన అర్చకులు సందీప్‌చారి శేషవస్త్రాలతో సత్కరించి తీర్థ ప్రసాదాలను అందించారు. ఆయన వెంట ఆలయ సిబ్బంది, ఉత్తరాధి మఠం సిబ్బంది, తదితరులు ఉన్నారు.

స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలి



ఎర్రవల్లిచౌరస్తా: ఎన్నికల్లో స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలని, ఎవరికి కూడా బయపడకుండా తమకు ఇష్టం ఉన్నవారికి ఓటును వేసుకోవచ్చునని సీఐ రాజు సూచించారు. ఆదివారం ఇటిక్యాల, ఎర్రవల్లి మండలాల్లోని ఆయా గ్రామాల్లో సీఐ ఆధ్వర్యంలో ఐటీబీపీ బలగాలతో ప్రత్యేక కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇటిక్యాల, కోదండాపురం పీఎస్‌ల ఎస్ఐల ఆధ్వర్యంలో చాగాపురం, షాబాద్, ఉదండాపురం, వల్లూరు, వేముల, బోరవెల్లి గ్రామాల్లో ఇండో టిబెన్ బార్డర్ పోలీస్ జవాన్లు ప్రధాన వీదుల్లో తిరుగుతూ ఓటర్లకు ఎన్నికల హక్కులపై అవగాహన కల్పించారు. ఎవరైనా అభ్యర్థులు, వివిధ పార్టీలకు చెందిన నాయకులు ఓటర్లపై దౌర్జన్యం చేసినా, ఇబ్బందులకు గురిచేసినా స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయాలని సీఐ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్సైలు కృష్ణదేవా, అశోక్‌బాబు, ఐటీబీపీ జవాన్లు, పోలీస్ సిబ్బంది, తదితరులు ఉన్నారు.

• బీజేపీకి జలక్..

కాంగ్రెస్‌కు బిగ్ షాక్

- కారెక్కిన ఎర్ర శేఖర్.. అదే దారిలో సీనియర్ నేత నాగం
- స్వయంగా ఆహ్వానించిన మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు
- సీఎం కేసీఆర్‌తోనూ భేటీ.. త్వరలో చేరిక
- 'కమలం' వీడి బీఆర్ఎస్‌లో చేరిన మాజీ మంత్రి పి.చంద్రశేఖర్
- ఉమ్మడి పాలమూరులో కీలక మలుపులు.. 7 సెగ్మెంట్లపై ప్రభావం



సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్:

పాలమూరులో రాజకీయం కీలక మలుపులు తిరుగుతోంది. మొదట్లో ముఖ్య నేతల చేరికలతో కాంగ్రెస్‌లో జోష్ నెలకొనగా.. అభ్యర్థుల ఖరారు తర్వాత పరిస్థితులు ఒక్కసారిగా మారిపోయాయి. అసమ్మతి జ్వాలలు ఎగిసిపడుతుండగా టికెట్ ఆశించి భంగపడిన నేతలు ఒక్కొక్కరుగా ఆ పార్టీని వీడుతున్నారు. జడ్చర్లకు చెందిన మాజీ ఎమ్మెల్యే ఎర్ర శేఖర్ ఆదివారం హస్తంను వీడి భారత రాష్ట్ర సమితిలో చేరగా.. నాగర్‌కర్నూల్‌కు చెందిన సీనియర్ నేత, మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి సైతం కారెక్కేందుకు సిద్ధమయ్యారు. అదే విధంగా బీజేపీకి చెందిన మాజీ మంత్రి పి.చంద్రశేఖర్ సైతం ఆ పార్టీకి జలక్ ఇచ్చి గులాబీ తీర్థం పుచ్చుకున్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయం దగ్గరపడుతున్న కొద్దీ ఉమ్మడి జిల్లాలో మారుతున్న పరిణామాలు పొలిటికల్ హీట్‌ను పెంచుతుండగా.. బీఆర్ఎస్ శ్రేణుల్లో ఉత్సాహం రెట్టింపవుతోంది.

'గులాబీ' చెంతకు ఎర్ర శేఖర్..

జడ్చర్ల లేదా నారాయణపేట నుంచి కాంగ్రెస్ టికెట్ ఆశించి, భంగపాటుకు గురైన మాజీ ఎమ్మెల్యే ఎర్ర శేఖర్ అలియాస్ ఎం.చంద్రశేఖర్ ఆదివారం ఉదయం హైదరాబాద్‌లో మంత్రి కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఆయన వెంట నారాయణపేట జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి ఉన్నారు.

❒ 1995లో ఎర్ర శేఖర్ టీడీపీ నుంచి రాజకీయాల్లో అడుగుపెట్టారు. పెద్దచింతకుంట ఎంపీటీసీగా గెలుపొంది ధన్వాడ ఎంపీపీ అయ్యారు. మొత్తం 6 పర్యాయాలు జడ్చర్ల, ఒక దఫా మహబూబ్‌నగర్ నుంచి అసెంబ్లీకి పోటీచేశారు.1996, 1999, 2009లో జడ్చర్ల నుంచి ఎమ్మెల్యేగా విజయం సాధించారు. రెండేళ్ల పాటు టీడీపీ జిల్లా అధ్యక్షుడిగా పనిచేశారు. ఆ తర్వాత పరిణామాల క్రమంలో 2019లో బీజేపీలో చేరి.. జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వర్తించారు. టీపీసీసీ చీఫ్‌గా రేవంత్‌రెడ్డి నియామకమైన తర్వాత బీజేపీని వీడి కాంగ్రెస్‌లో చేరారు. తాజాగా గులాబీ చెంతకు చేరారు.



మాజీమంత్రి పి.చంద్రశేఖర్ సైతం..

బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ మంత్రి పొడపాటి చంద్రశేఖర్ ఆదివారం బీఆర్ఎస్‌లో చేరారు. ఆ పార్టీలో క్రియాశీలకంగా పనిచేసిన ఆయన మహబూబ్‌నగర్ నియోజకవర్గం నుంచి టికెట్ ఆశించారు. రాకపోవడంతో మనస్తాపానికి గురైన ఆయన బీజేపీకి రాజీనామా చేశారు. ఆ వెంటనే రాష్ట్ర ఎక్సైజ్ శాఖమంత్రి శ్రీనివాస్‌గౌడ్, శాసన మండలి వైస్ చైర్మన్ బండా ప్రకాష్‌తో కలిసి ప్రగతిభవన్‌కు వెళ్లారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ ఆయనకు గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

❒ మహబూబ్‌నగర్ అసెంబ్లీ నుంచి టీడీపీ అభ్యర్థిగా పి.చంద్రశేఖర్ 1983, 1985, 1994, 1999 ఎన్నికల్లో బరిలో నిలిచి విజయం సాధించారు. 1989, 2004 ఎన్నికల్లో మాత్రం ఓడిపోయారు. ఎన్టీఆర్, చంద్రబాబు ప్రభుత్వ హయాంలో మంత్రిగా పనిచేశారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమ నేపథ్యంలో టీడీపీని వీడి టీఆర్ఎస్‌లో చేరారు. రాష్ట్ర విభజన అనంతర పరిణామాల క్రమంలో కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. కొంతకాలం తర్వాత బీజేపీలో చేరిన ఆయన తాజాగా మళ్లీ గులాబీ చెంతకు చేరారు.

సీఎం కేసీఆర్‌తో నాగం భేటీ..

నాగర్‌కర్నూల్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి టికెట్ ఆశించిన కాంగ్రెస్ నేత నాగం జనార్దన్‌రెడ్డిని కాదని.. ఇటీవల పార్టీలో చేరిన ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి తనయుడు రాజేశ్‌రెడ్డికి కట్టబెట్టిన విషయం తెలిసిందే. దీనిపై ఆగ్రహంతో ఉన్న ఆయన ఆదివారం పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తూ ఏఐసీసీ అధ్యక్షుడికి లేఖ రాశారు. ఆ తర్వాత హైదరాబాద్‌లోని నాగం జనార్దన్‌రెడ్డి ఇంటికి బీఆర్ఎస్ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి చేరుకుని మంతనాలు జరిపారు. అనంతరం మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు నాగం ఇంటికి చేరుకుని.. బీఆర్ఎస్‌లోకి రావాలని ఆహ్వానించారు. ఈ సందర్భంగా నాగర్‌కర్నూల్ భవిష్యత్ కోసం బీఆర్ఎస్‌లో చేరుతున్నానని ప్రకటించిన ఆయన.. రాత్రి సీఎం కేసీఆర్‌ను సైతం కలిశారు. పార్టీలో సముచిత స్థానంతోపాటు తగిన గుర్తింపు ఇస్తామని హామీ ఇవ్వడంతో త్వరలో జరిగే ప్రజా ఆశీర్వాద సభలో కేసీఆర్ సమక్షంలో ఆయన గులాబీ కండువా కప్పుకోనున్నట్లు తెలుస్తోంది.

❒ డాక్టర్‌గా సేవలందిస్తూ 1983లో టీడీపీలో చేరిన నాగం ఇప్పటి వరకు తొమ్మిది పర్యాయాలు ఎమ్మెల్యేగా పోటీ చేశారు. ఇందులో ఆరు దఫాలు (1985, 1994, 1999, 2004, 2009, 2012)లో గెలుపొందారు. 1995లో చంద్రబాబు కేబినెట్‌లో తొలిసారిగా మంత్రి పదవి చేపట్టారు. ఆ తర్వాత 1999లో కూడా టీడీపీ అధికారంలోకి రాగా.. మంత్రిగా పనిచేశారు.

ఆయా నియోజకవర్గాలపై ప్రభావం..

సీనియర్ నేత నాగం జనార్దన్‌రెడ్డికి ఉమ్మడి జిల్లాపై మంచి పట్టు ఉంది. పలు పర్యాయాలు మంత్రిగా పనిచేసిన అనుభవమున్న ఆయన బీఆర్ఎస్‌లో చేరనుండడంతో నాగర్‌కర్నూల్‌తోపాటు కొల్లాపూర్, వనపర్తి సెగ్మెంట్లలో గులాబీకి కలిసి వచ్చే అవకాశం ఉంది. అదేవిధంగా ఎర్రశేఖర్ కారెక్కిన నేపథ్యంలో జడ్చర్లతోపాటు నారాయణపేటలో బీఆర్ఎస్‌కు మరింత బలం చేకూరనున్నట్లు తెలుస్తోంది. పి.చంద్రశేఖర్ గులాబీ చెంతకు చేరడంతో మహబూబ్‌నగర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే మంత్రి శ్రీనివాస్‌గౌడ్ గెలుపు సునాయాసమైనట్లు రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

రేవంత్ ఇలాకాపై బీఆర్ఎస్ స్పెషల్ ఫోకస్..

పి.చంద్రశేఖర్, ఎర్ర శేఖర్ ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన వారు కాగా.. బీఆర్ఎస్ అభ్యర్థులకు మేలు చేసే అంశంగా భావిస్తున్నాయి. టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి బరిలో ఉన్న కొడంగల్ నియోజకవర్గంలో ముదిరాజ్ ఓట్లు సుమారు 55 వేల వరకు ఉన్నాయి. ఈ సెగ్మెంట్‌లో వారిదే ఆధిక్యత. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ కీలక నేతలు భారీ స్కెచ్ వేసినట్లు తెలుస్తోంది. కాగా, మహబూబ్‌నగర్, దేవరకద్రలో కాంగ్రెస్ టికెట్ల ఖరారు తర్వాత అసమ్మతి రాజుకుంది. పునరాలోచించాలని.. రెండు రోజుల్లో నిర్ణయం వెల్లడించాలని ఆశావహులు ఆ పార్టీ అధిష్టానానికి అల్టిమేటం జారీ చేసినట్లు సమాచారం. స్పందించని పక్షంలో ఆ నియోజకవర్గాలకు చెందిన కొందరు నాయకులు సైతం బీఆర్ఎస్‌లో చేరనున్నట్లు విశ్వసనీయవర్గాల ద్వారా తెలిసింది.

ప్రశాంత ఎన్నికలే లక్ష్యం

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో భద్రత పెంపు

- నగదు.. మద్యం రవాణాపై నిఘా
- అభ్యర్థుల ప్రచార కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి
- సి– విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదుల స్వీకరణ.. తక్షణ పరిష్కారం
- శాంతిభద్రతలు విస్మరిస్తే కఠిన చర్యలు
- 'సాక్షి'తో ఎస్పీ రితిరాజ్



గద్వాల క్రైం: అసెంబ్లీ ఎన్నికల నిర్వహణను చాలెంజ్‌గా తీసుకున్నాం. ఎన్నికల నిర్వహణ విధులు మొదటిసారి చేపట్టా. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా భద్రతాపరమైన ఏర్పాట్లు చేస్తున్నాం. ఎవరు శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా చర్యలు తీసుకుంటాం. గద్వాల – అలంపూర్ రెండు సెగ్మెంట్‌లలో అవసరమైన అదనపు బలగాలను నియమించాం. సరిహద్దు ప్రాంతాల్లో ప్రత్యేక చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి 24 గంటలు తనిఖీలు చేస్తున్నాం. నగదు, మద్యం, ఇతర వాటిపై ప్రత్యేక నిఘా ఉంచాం. అలాగే, జిల్లాలో నమోదైన పాత కేసుల విచారణ, అనుమానిత వ్యక్తులపై నిఘా ఉంచామని ఎస్పీ రితిరాజ్ అన్నారు. ఆదివారం ఆమె 'సాక్షి' ఇంటర్వ్యూలో మాట్లాడారు. ఈమేరకు పూర్తి వివరాలిలా..

ప్రశ్న: ఎన్నికల్లో ప్రధాన సవాళ్లు ఏంటి..?

ఎస్పీ: మద్యం, నగదు కట్టడి చేయడమే. ఓటర్లు ప్రశాంత వాతావరణంలో ఓటు వేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం. భద్రత కీలకమైన అంశం.. అందుకే రాష్ట్ర పోలీసు శాఖకు చెందిన సిబ్బందితో పాటు కేంద్ర బలగాలను వినియోగిస్తాం. ఇప్పటికే కేంద్ర బలగాలు ఆయా సమస్యాత్మక ప్రాంతాల్లో వారికి విధులు నిర్వహించాం. ఇక నాయకుల మధ్య ఉండే పోటీతత్వం, ఒకరిపై మరొకరు ఫిర్యాదులు చేయడం లాంటిపై అప్రమత్తంగా ఉంటాం. ఓటర్లను ప్రలోభాలకు గురి చేస్తున్నారనే ఆరోపణలపై నిజానిజాలు తెలుసుకొని ఏ పార్టీ వారైన సరే ఎన్నికల కోడ్ నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటాం. అధికారులను తప్పుదోవ పట్టించే వ్యక్తులపై ఉక్కుపాదం మోపుతాం.

ప్రశ్న: తనిఖీల్లో పట్టుబడిన నగదులో సామాన్యులవి ఎంత, నాయకులవి ఎంత?

ఎస్పీ: రూ.50వేలకు మించి నగదు ఎవరితో ఉన్నా సీజ్ చేస్తాం. వారు నాయకులా, సామాన్యులా అనే అంశం కాదు. నగదుకు సంబంధించి సరైన ధృవపత్రాలు ఉంటే తిరిగి ఇచ్చేస్తాం. లేకుంటే నగదును గ్రీవెన్స్ కమిటీకి అప్పగిస్తాం. జిల్లాలో ఐదు చెక్ పోస్టులు ఏర్పాటు చేసి పక్కాగా సోదాలు చేస్తున్నాం. రూ. 10లక్షల కంటే ఎక్కువ ఉంటేనే సమస్య. వారు లెక్కలు చూపించుకోవాలి. 24 గంటల్లో సరైన ధ్రువపత్రాలు చూపిస్తే నగదు తిరిగి ఇచ్చేస్తాం. లేదంటే ఆదాయ పన్నుల శాఖ వారికి అప్పగిస్తాం. ఓటర్లను ప్రలోభాలకు గురి చేసినట్లు, పంచుతున్నట్లు సరైన ఆధారాలు ఉంటే చర్యలు ఉంటాయి.

ప్రశ్న: అల్లర్లకు పాల్పడే వారిని ఎలా అడ్డుకుంటారు?

ఎస్పీ: రౌడీ షీటర్లు, గత ఎన్నికల్లో సమస్యలు సృష్టించే ప్రయత్నం చేసి, కేసుల్లో ఉన్నవారు, క్రిమినల్ కేసులో ప్రధాన పాత్ర ఉన్నవారు జిల్లాలో 782 మందిని గుర్తించి వారిని బైండోవర్ చేశాం. త్వరలో మరి కొంత మందిని బైండోవర్ చేస్తాం. అనుమానితులు అందరి కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచాం. పాత కేసులు, అల్లర్లకు పాల్పడవచ్చు అని అనుమానం ఉన్న వారందరికీ ఇప్పటికే కౌన్సెలింగ్ ఇచ్చాం. మరోసారి ఇస్తాం. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కడైన ఘర్షణలు, హింస, అవాంఛనీయ సంఘటనలకు ఎవరు పాల్పడినా వారిపై కఠిన చర్యలు తప్పవు.

ప్రశ్న: ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించేందుకు ఏం చర్యలు తీసుకున్నారు?

ఎస్పీ: గత ఎన్నికల్లో జరిగిన సంఘటనల ఆధారంగా భద్రత ఏర్పాట్లపై కసరత్తు చేస్తున్నాం. గద్వాల– అలంపూర్ సెగ్మెంట్‌లో 593 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. వాటిలో 396 సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించాం. ఆ ప్రాంతాల్లో రాష్ట్ర పోలీసు సిబ్బందితో పాటు కేంద్ర బలగాలతో పటిష్టమైన భద్రత కల్పిస్తాం. అవసరమైతే సీనియర్ అధికారుల పర్యవేక్షణ ఏర్పాటు చేస్తాం. అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: సభలకు అనుమతులు తప్పనిసరా..? నిబంధనలు ఉల్లంఘిస్తే ఏం చర్యలు తీసుకుంటారు ?

ఎస్పీ: ఎన్నికల ప్రచారంలో భాగంగా ఏ పార్టీ నాయకులైన సరే ముందుస్తుగా పోలీసుశాఖ నుంచి అనుమతి తీసుకోవాలి. అనుమతి లేకుండా సభలు, సమావేశాలు, ర్యాలీలు నిర్వహిస్తే చర్యలు చేపడతాం. రాత్రి 10 గంటలకు నుంచి ఉదయం 6 గంటల సమయాల్లో ప్రచార కార్యక్రమాలు నిర్వహించడానికి వీల్లేదు. కరపత్రాలు ఉంటే వాటి ముద్రణ వివరాలు తెలపాలి. సోషల్ మీడియాలో పార్టీ, కులాలు, మతాల పేరుతో ఇతరుల మనోభావాలు కించపరుస్తూ.. రెచ్చగొట్టేలా ఘర్షణకు తావిచ్చేలా కామెంట్స్ పెట్టినా, పోస్టులు చేసినా సభల్లోఅలాంటి ప్రసంగాలు చేసిన ఎన్నికల నిబంధనల ప్రకారం వారిపై చర్యలు చేపడతాం. ప్రత్యేక విభాగంతో సోషల్ మీడియాపై నిరంతరం నిఘా ఉంటుంది. ఉల్లంఘనులపై ఎవరైనా సి – విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చు. 1950 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేస్తే 100 నిమిషాల్లో పరిష్కరిస్తాం.

ప్రశ్న: మీ కుటుంబ నేపథ్యం వివరిస్తారా..?

ఎస్పీ: మా స్వస్థలం బీహార్ రాష్ట్రం నల్లంద జిల్లాలోని పాట్న. తల్లిండ్రులు నీలంసన్న (గృహిణి), బీపిన్ బిబి కుమార్(రిటైర్డు ఐఆర్ఎస్). భర్త సంచిత్ గౌరవ్ ట్రైనీ ఐఏఎస్, తెలంగాణ. నా విద్యాభ్యాసం అంతా ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లోనే పూర్తిచేశా. ఉన్నత విద్య సల్సార్‌లా కాలేజీలో చేశా. ఐపీఎస్ లక్ష్యంగా పోటీపరీక్షలకు సిద్ధమయ్యా. 2017లో ఐపీఎస్‌కు రెండవ సారి ఎంపికయ్యాను. 2018 బ్యాచ్ ఐపీఎస్, మొదటి పోస్టింగ్ సైబరాబాద్ క్రైం విభాగంలో డీసీపీగా చేశా. అనంతరం సూర్యాపేట, కరీంనగర్‌లో ట్రైనీ అధికారిగా విధులు నిర్వహించా.

అడవి బిడ్డలు.. అనాగరిక బతుకులు

అటవీ ఉత్పత్తులే జీవనాధారంగా కాలం వెళ్లదీత

- నేటికీ మెరుగైన విద్య, వైద్యానికి నోచుకోని చెంచు, గిరిజనం
- ప్రత్యేక ఉపాధి హామీ పథకం రద్దుతో అవస్థలు
- పూర్తిస్థాయిలో అమలు కాని గిరివికాసం
- యువతకు ఉపాధి, ఉద్యోగావకాశాలు లేక ఇక్కట్లు
- 'సాక్షి' పీపుల్స్ ఎజెండాలో సమస్యల ఏకరవు

కనీసం ఇళ్లు లేక బొడ్డు గుడిసెలే నివాసాలుగా మార్చుకున్నారు.. కందమూలలు తింటూ.. నిశిరాత్రిలో కట్టెల (నేగడి) మంటల వెలుగుల్లో.. మెరుగైన విద్య, వైద్యంతోపాటు.. కనీస వసతులకు నోచుకోక.. దట్టమైన అడవుల్లో క్రూరమృగాల మధ్య అనాగరిక జీవితం గడుపుతున్నారు.. అడవిలో పుట్టి.. అడవిలో పెరిగి.. ఇదే సర్వస్వంగా భావిస్తూ.. ఏడు దశాబ్దాల స్వతంత్ర భారతంలో నేటికీ ఎలాంటి మార్పు లేకుండా జీవిస్తున్నారు నల్లమలలోని చెంచు, గిరిజనులు. వీరి అభివృద్ధి, సంక్షేమం కోసం ఎన్నో పథకాలు ప్రవేశ పెడుతున్నా.. అవేమీ వారి జీవితాల్లో వెలుగులు నింపలేకపోతున్నాయి.

– బండారు శ్రీనివాస్, అచ్చంపేట



కొమ్మినపెంటలో చెంచులు జీవిస్తున్న బొడ్డు గుడిసెలు

• పీపుల్స్ ఎజెండా

నల్లమలలో జీవిస్తున్న చెంచులకు ఉపాధి కల్పించేందుకు జాతీయ ఉపాధి హామీ పథకం, వ్యవసాయ, గిరిజన సహకార సంస్థతోపాటు ఐకేపీ, టీపీఎంయూ ఐటీడీఏలో అంతర్భాగంగా ఉన్నాయి. నేటికీ వందలాది మంది చెంచులకు వ్యవసాయ భూమి లేదు. అటవీ ఉత్పత్తుల సేకరణతోపాటు వ్యవసాయం వైపు మొగ్గు చూపుతున్న చెంచులు భూ పంపిణీకి నోచుకోవడం లేదు. విద్య, వైద్యం, గృహ నిర్మాణం, వ్యవసాయం, తాగునీటి వసతి వంటివి అమలు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పక్కా ఇళ్లు లేక రాత్రివేళ బొడ్డు గుడిసెల్లో కట్టెల మంటల (నెగడి)తో కాలం వెళ్లదీస్తున్నారు. దీర్ఘకాలిక రోగాల గురించి వైద్య, ఆరోగ్య శాఖ, ఐటీడీఏ పట్టించుకోకపోవడంతో వ్యాధులు ముదిరి చెంచుల ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. దీర్ఘకాలిక రోగాలతోపాటు మలేరియా, క్షయ, పక్షవాతం, కడుపులో గడ్డలు, విషజ్వరాలు, రక్తహీనత, శ్వాసకోశ వ్యాధులతో బాధపడుతున్నారు.

సుస్తి చేస్తే.. ప్రాణాల మీదకు

అమ్రాబాద్ మండలం జంగంరెడ్డిపల్లిలో 60 చెంచు కుటుంబాలు ఉన్నాయి. అధికంగా వ్యవసాయ కూలీలుగా జీవనం సాగిస్తున్నారు. మరికొంత మందికి వ్యవసాయ భూములు ఉన్నా.. సాగు చేసుకోలేని పరిస్థితి. ముఖ్యంగా నూతనంగా ఏర్పాటైన కాలనీల్లో సరైన రోడ్డు సౌకర్యం లేదు. మధ్యలో చదువు ఆపేసి పనులు లేక యువకులు ఖాళీగా ఉంటున్నారు. సుస్తి చేస్తే ఆర్టీటీ ఆస్పత్రిలో వైద్యం చేయించుకుంటారు. ఖర్చుతో కూడుకున్న రోగాలు వస్తే ఆస్పత్రికి వెళ్లలేక ప్రాణాలు వదులుతున్నారు. ఈ క్రమంలో ఆదివారం 'సాక్షి' ఆధ్వర్యంలో నిర్వహించిన పీపుల్స్ ఎజెండాలో వారి బాధలను ఏకరువు పెట్టారు.

పోస్టుల భర్తీలో నిర్లక్ష్యం



మన్ననూర్ ఐటీడీఏ ఏర్పాటు తర్వాత ఒక పోస్టు మంజూరు చేయలేదు. ఈ విషయాన్ని గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదు. పర్యవేక్షణ అధికారులు లేకపోవడంతో చెంచులకు తీవ్ర అన్యాయం జరుగుతుంది. బడ్జెట్ కేటాయింపులు కూడా అంతంత మాత్రంగానే ఉన్నాయి. చెంచులపై ప్రభుత్వం శ్రద్ధ చూపడం లేదు. వివిధ రోగాల బారిన పడి చెంచు జాతి రోజురోజుకు తగ్గిపోతుంది.

– నిమ్మల శ్రీనివాసులు, ఆదివాసీ చెంచు ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు

మా గురించి పట్టదు



ప్రత్యేకంగా చెంచులకు ఎలాంటి ఉపాధి హామీ పనులు కల్పించడం లేదు. ఇది వరకు ప్రత్యేక పనులు చేయించేవారు. ఇప్పుడు అందరి లాగే కూలీ పనులు చేస్తున్నాం. చాలీచాలని కూలీతో ఇబ్బందులు పడుతున్నాం. ఐటీడీఏ అధికారులు మా గురించి పట్టించుకోవడం లేదు. ప్రభుత్వం తిరిగి ప్రత్యేక ఉపాధితోపాటు ఆర్థికంగా ఆదుకునేందుకు చర్యలు తీసుకోవాలి.

– ముత్తమ్మ, సార్లపల్లి, అమ్రాబాద్ మండలం

యువతను ఆదుకోవాలి..



మా ఊరిలో పదో తరగతి లోపు చదివిన చాలామంది చెంచు యువకులు ఉన్నారు. వారందరికీ ప్రభుత్వ సంస్థల్లో, లేదా ప్రైవేట్ కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించి ఆదుకోవాలి. లేదంటే నిరుద్యోగ భృతి చెల్లించాలి. – బాలయ్య, జంగంరెడ్డిపల్లి

బడుగు బలహీన వర్గాల అభ్యున్నతే ధ్యేయం



మేకలసోంపల్లిలో భారీ పూలమాలతో జెడ్పీ చైర్‌పర్సన్ సరితను సన్మానిస్తున్న గ్రామస్తులు

గద్వాల అర్బన్/మల్దకల్: బడుగు బలహీన వర్గాల అభ్యున్నతే కాంగ్రెస్ పార్టీ ధ్యేయమని కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి, జెడ్పీచైర్‌పర్సన్ సరిత అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని జెడ్పీ చైర్‌పర్సన్ క్యాంపు కార్యాలయంలో గద్వాల మండలంలోని చెనుగొనిపల్లి, కొత్తపల్లి, సంగాల, కొండపల్లి గ్రామాలతో పాటు పట్టణంలోని 15,12,3వ వార్డుల్లోని పలువురు యువత, 7వ వార్డుకు చెందిన మాజీ కౌన్సిలర్ మొహమ్మద్, టీఎస్ఆర్ జగదీష్, మల్దకల్ మండలం విఠలపురం, ధరూర్ మండలంలోని నీలహళ్లి గ్రామాలకు చెందిన పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీలో చేరారు. అదేవిధంగా తెలుగు ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు డీటీడీసీ నర్సింహ్మ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున్న కాంగ్రెస్ పార్టీలో చేరారు. అంతకు ముందు పట్టణ శివారులోని ధరూర్ మెట్టు వద్ద నుంచి రాజావీధి మీదుగా క్యాంపు కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు.

మల్దకల్‌లో..

మల్దకల్ మండలంలోని మేకలసోంపల్లి, దాసర్‌పల్లి గ్రామాలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సరిత మాట్లాడుతూ గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం పేదల అభ్యున్నతి కోసం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టి వాటిని పార్టీలకతీతంగా అందించిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కిందన్నారు. కాంగ్రెస్ పార్టీ హామీలను కార్యకర్తలు ప్రజలందరికీ వివరించాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ నాయకులు మధుసూదన్‌బాబు, కృష్ణారెడ్డి, శ్రీనివాసరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, వెంకటన్న, శ్రీనివాస్‌గౌడు, సర్పంచులు, ఎంపీటీసీలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

విలక్షణ తీర్పు.. చైతన్యంతో మార్పు

ఇదీ కొల్లాపూర్ ఓటర్ల తీరు

- తొలి ఎమ్మెల్యేగా కమ్యూనిస్టు అభ్యర్థి గెలుపు
- మూడుసార్లు స్వతంత్రులకు పట్టం
- వరుసగా ఐదుసార్లు విజయం సాధించిన జూపల్లి
- 1978 నుంచి 2014 వరకు వరుసగా పదిసార్లు వెలమలకు అందలం
- అప్రతిహత విజయాలకు చెక్‌పెట్టిన హర్షవర్ధన్‌రెడ్డి

– కొల్లాపూర్

10లో..

ఓటరు పండగ.. మద్యం దండిగ

– మహబూబ్‌నగర్ క్రైం

10లో..

క్లుప్తంగా

మద్యం పట్టివేత



గద్వాల క్రైం/చిన్నచింతకుంట/అచ్చంపేట రూరల్/తెలకపల్లి/ఉప్పునుంతల/కృష్ణా: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఆదివారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పోలీసులు ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. పలు గ్రామాల్లో బెల్ట్‌షాపులపై దాడులు నిర్వహించడంతో పాటు వివిధ ప్రాంతాలకు అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేశారు.

■ గద్వాల మండలంలోని బస్రాచెర్వుకు చెందిన పరుశరాముడు కిరాణ దుకాణంలో రూ.4వేల విలువ గల మద్యం స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్‌ఐ ఆనంద్ తెలిపారు.

■ చిన్నచింతకుంట మండల కేంద్రం నుంచి లాల్‌కోటకు చెందిన మల్లేష్ తన బెల్ట్‌షాపునకు మద్యం తరలిస్తుండగా, పట్టుకుని సీజ్ చేసినట్లు ఎస్‌ఐ శేఖర్ తెలిపారు. మల్లేష్‌పై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

■ అచ్చంపేట మండలం గుంపన్‌పల్లిలో శ్రీను బెల్ట్‌షాపుపై దాడులు నిర్వహించి రెండు కాటన్ల బీర్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ గోవర్దన్ తెలిపారు. మద్యం విక్రయిస్తున్న శ్రీనుపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

■ తెలకపల్లి మండలం పెద్దపల్లిలో రాములు గౌడ్ మద్యం విక్రయిస్తుండగా, దాడి చేసి పట్టుకున్నట్లు ఎస్‌ఐ వసీరాంనాయక్ తెలిపారు. అతడి నుంచి 10 బీర్లు, 5 క్వాటర్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

■ ఉప్పునుంతల మండలం దేవదారికుంట తండాకు చెందిన రామావత్ రాజేష్ మండల కేంద్రం నుంచి 12 బీర్లు తరలిస్తుండగా, పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ అంజయ్య తెలిపారు.

■ నారాయణపేట జిల్లా కృష్ణా మండల సరిహద్దులోని చెక్‌పోస్టు వద్ద 5.5 లీటర్ల గోవా మద్యాన్ని పట్టుకున్నట్లు ఎక్సైజ్ సీఐ శ్రావణకుమార్, ఎస్‌ఐ భవాని తెలిపారు. మద్యం తరలిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

రూ.1.90లక్షల నగదు సీజ్

వనపర్తి: జిల్లా వ్యాప్తంగా ఆదివారం నిర్వహించిన వాహనాల తనిఖీల్లో రూ.1.90 లక్షల నగదు పట్టుబడిందని ఎస్పీ రక్షితా కె.మూర్తి వెల్లడించారు. పెబ్బేరు పోలీస్‌స్టేషన్ పరిధిలో రూ.లక్ష, పెద్దమందడి మండలం వెల్టూరు చెక్‌పోస్టు వద్ద రూ.90వేల నగదును గుర్తించి సీజ్ చేసినట్లు తెలిపారు. అదేవిధంగా జిల్లా కేంద్రంలోని పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో 5 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు పేర్కొన్నారు.

ముగిసిన రీజియన్ కాన్ఫరెన్స్

జడ్చర్ల టౌన్: మండలకేంద్రంలోని ఆదివారం వాసవీ క్లబ్ రీజియన్ కాన్ఫరెన్స్ ముగిసింది. బాదం శ్రీనివాస్ సేవాపురస్కార్ పేరుతో నిర్వహించిన కార్యక్రమానికి క్లబ్ ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ అవునూరి శివలీల హాజరయ్యారు. జడ్చర్ల క్లబ్ ద్వారా అందిస్తున్న సేవలను కొనియాడారు. రీజియన్‌లోని 12 క్లబ్‌లకు చెందిన ప్రతినిధులు హాజరయ్యారు. ఆయా క్లబ్‌లలో చేసిన సేవా కార్యక్రమాలకు సంబంధించి అవార్డుల ప్రదానం చేశారు. డిస్ట్రిక్ట్ గవర్నర్ మేడిశెట్టి రామకృష్ణ, వాసవీ క్లబ్ అధ్యక్షుడు చిగుళ్లపల్లి లక్ష్మీనారాయణ, కార్యదర్శి పోల వినోద్, వనితా క్లబ్ అధ్యక్షురాలు పద్మలీల తదితరులు పాల్గొన్నారు.

విలక్షణ తీర్పు.. చైతన్యంతో మార్పు

ఇదీ కొల్లాపూర్ ఓటర్ల తీరు

- తొలి ఎమ్మెల్యేగా కమ్యూనిస్టు అభ్యర్థి గెలుపు
- మూడుసార్లు స్వతంత్రులకు పట్టం
- వరుసగా ఐదుసార్లు విజయం సాధించిన జూపల్లి
- 1978 నుంచి 2014 వరకు వరుసగా పదిసార్లు వెలమలకు అందలం
- అప్రతిహత విజయాలకు చెక్‌పెట్టిన హర్షవర్ధన్‌రెడ్డి

కొల్లాపూర్: సురభి రాజుల సంస్థానంలో భాగమైన కొల్లాపూర్ నియోజకవర్గ ప్రజల తీర్పు ప్రతి ఎన్నికలోనూ విలక్షణంగా ఉంటుంది. రాజకీయ చైతన్యం కలిగిన ఈ ప్రాంత ప్రజలు ఎప్పుడు ఎవరిని గెలిపిస్తారో అంచనా వేయడం కష్టమే. తప్పనిసరిగా ఓడిపోతాడనుకున్న అభ్యర్థిని గెలిపిస్తూ.. గెలిచి తీరుతాడనుకున్న అభ్యర్థిని ఓడిస్తూ.. నియోజకవర్గ ఓటరు అందరి అంచనాలను తలకిందులు చేస్తుంటారు. మొదటిసారి కమ్యూనిస్టు అభ్యర్థికి పట్టం కట్టిన కొల్లాపూర్‌వాసులు ఆ తర్వాత 1978 నుంచి 2014 ఎన్నికల వరకు పది పర్యాయాలుగా వరుసగా వెలమ కులస్తులను అందలం ఎక్కించారు. వెలమలను ఓడించి ఎమ్మెల్యే పదవి చేపట్టాలని గత నాలుగు ఎన్నికల్లో రెడ్డి సామాజిక వర్గం ప్రయత్నించగా.. చివరికి 2018లో బీరం హర్షవర్ధన్ రెడ్డి విజయం సాధించి వెలమల అప్రతిహిత విజయాలకు ఫుల్‌స్టాప్ పెట్టారు. ఈసారి కూడా వెలమ, రెడ్డి సామాజిక వర్గాల మధ్యే ప్రధాన పోటీ ఉండబోతోంది.



కొల్లాపూర్ పట్టణ వ్యూ

మూడుసార్లు స్వతంత్ర అభ్యర్థులు

నియోజకవర్గంలో మూడుసార్లు స్వతంత్ర అభ్యర్థులు విజయం సాధించారు. 1967లో కాంగ్రెస్ అభ్యర్థి రంగదాసుపై స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసిన బి.నర్సింహారెడ్డి 1,585 ఓట్ల తేడాతో గెలుపొందారు. 1972లో కాంగ్రెస్ పార్టీ టికెట్‌ను కొత్త వెంకటేశ్వర్‌రావుకు కేటాయించింది. దీంతో కె.రంగదాసు స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగి వెంకటేశ్వర్‌రావుపై 3,558 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. 2004లో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పొత్తు కారణంగా టికెట్‌ను బీఆర్‌ఎస్ అభ్యర్థి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డికి కేటాయించడంతో జూపల్లి కృష్ణారావు స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేశారు. ఆ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి కటికనేని మధుసూదన్‌రావుపై జూపల్లి 3,040 ఓట్ల తేడాతో గెలుపొందారు.

పోటాపోటీ రాజకీయం..

నియోజకవర్గంలో గతంలో కాంగ్రెస్, టీడీపీల మధ్య పోటాపోటీ రాజకీయం నడిచేది. 1983 నుంచి 2012 వరకు టీడీపీ అభ్యర్థులు ఆరుసార్లు ఎన్నికల బరిలో నిలిచారు. 1985, 1989, 2014, 2018 పొత్తుల కారణంగా పోటీ చేయలేదు. 1994లో మాత్రమే ఆ పార్టీ అభ్యర్థి కటికనేని మధుసూదన్‌రావు కాంగ్రెస్ అభ్యర్థి రామచందర్‌రావుపై 33,774 ఓట్ల భారీ మెజార్టీతో గెలిచారు. గెలుపు అవకాశాలున్నప్పటికీ గ్రూపు తగాదాల కారణంగా 1999, 2004, 2009లో టీడీపీ అభ్యర్థులు స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యారు. చివరగా 2012 ఉప ఎన్నికల్లో టీడీపీ పోటీ చేయగా.. 35 వేల ఓట్లు మాత్రమే వచ్చాయి.



అనంత రామచంద్రారెడ్డి



మందుగుల నర్సింగరావు



కె.రంగదాసు



బి.నర్సింహారెడ్డి



కొత్త వెంకటేశ్వర్ రావు



కొత్త రామచందర్‌రావు



మధుసూదన్‌రావు



జూపల్లి కృష్ణారావు



హర్షవర్ధన్‌రెడ్డి

వరుసగా పదిసార్లు..

1978 నుంచి కొల్లాపూర్‌లో 2014 వరకు మొత్తం పదిసార్లు వరుసగా వెలమ కులస్థులు ఎమ్మెల్యేగా గెలిచారు. 1978, 1983, 1985 ఎన్నికల్లో వరుసగా మూడుసార్లు కొత్త వెంకటేశ్వర్‌రావు విజయం సాధించారు. 1989 ఎన్నికల్లో కొత్త రామచందర్‌రావు గెలుపొందారు. 1994 ఎన్నికల్లో కటికనేని మధుసూదన్‌రావు, 1999, 2004, 2009, 2012, 2014 ఎన్నికల్లో వరుసగా జూపల్లి కృష్ణారావు విజయకేతనం ఎగురవేశారు.

విజేతలు వీరే..

సంవత్సరం	విజేత	వచ్చిన ఓట్లు	ప్రత్యర్థి	వచ్చిన ఓట్లు	మెజార్టీ
1952	అనంత రామచంద్రారెడ్డి	8,940	శాంతాబాయి	7,344	1,596
1957	మందుమల నర్సింగరావు	19,366	కటికనేని గోపాల్	10,021	9,345
1962	కె.రంగదాసు	21,197	కటికనేని గోపాల్	19,855	1,342
1967	బి.నర్సింహారెడ్డి	25,321	కె.రంగదాసు	23,749	1,572
1972	కె.రంగదాసు	27,434	కొత్త వెంకటేశ్వర్‌రావు	23,876	3,588
1978	కొత్త వెంకటేశ్వర్‌రావు	36,325	కె.రంగదాసు	21,662	14,663
1983	కొత్త వెంకటేశ్వర్‌రావు	39,241	వీపనగండ్ల కృష్ణారెడ్డి	26,533	12,708
1985	కొత్త వెంకటేశ్వర్‌రావు	41,222	సురవరం సుధాకర్	38,723	2,499
1989	కొత్త రామచందర్‌రావు	47,950	సురవరం సుధాకర్	38,791	9,159
1994	కటికనేని మధుసూదన్‌రావు	55,777	కొత్త రామచందర్‌రావు	22,003	33,774
1999	జూపల్లి కృష్ణారావు	54,677	కటికనేని మధుసూదన్‌రావు	49,372	5,035
2004	జూపల్లి కృష్ణారావు	49,369	కటికనేని మధుసూదన్‌రావు	46,329	3,040
2009	జూపల్లి కృష్ణారావు	58,046	చింతలపల్లి జగదీశ్వర్‌రావు	56,538	1,508
2012	జూపల్లి కృష్ణారావు	58,107	మామిళ్లపల్లి విష్ణువర్ధన్	43,083	15,024
2014	జూపల్లి కృష్ణారావు	72,741	బీరం హర్షవర్ధన్‌రెడ్డి	62,243	10,498
2018	బీరం హర్షవర్ధన్‌రెడ్డి	80,617	జూపల్లి కృష్ణారావు	68,071	12,546

బీసీలు, ఎస్సీలే కీలకం..

కొల్లాపూర్ నియోజకవర్గంలో 75శాతానికి పైగా బీసీలు, ఎస్సీల ఓట్లే ఉన్నాయి. రెడ్డి కులస్థుల ఓట్లు 23 వేల వరకు ఉండగా.. వెలమల ఓట్లు 5 వేలలోపే ఉన్నాయి. బీసీల్లో అధిక శాతం ఓట్లు యాదవులవి కాగా.. ఎస్సీలో మాదిగలవి అధిక శాతం ఓట్లు ఉన్నాయి. విశేషమేమంటే ఇప్పటి వరకు జరిగిన ఎన్నికల్లో రెడ్డి, వెలమ కులస్థులే ఎక్కువ సార్లు ఎమ్మెల్యేగా గెలుస్తున్నారు. మూడుసార్లు రెడ్డి కులస్థులు గెలవగా.. బీసీ నేత కె.రంగదాసు రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారు.

కొల్లాపూర్ నియోజకవర్గంలో మండలాల వారీగా ఓటర్లు ఇలా..

మండలం	పురుషులు	స్త్రీలు	ఇతరులు	మొత్తం
కొల్లాపూర్	23,341	22,506	-	45,847
పెద్దకొత్తపల్లి	23,792	23,056	3	46,851
పాన్‌గల్	20,449	19,295	1	39,745
కోడేరు	17,202	16,345	-	33,547
చిన్నంబావి	12,003	11,817	-	23,820
వీపనగండ్ల	11,470	11,044	-	22,514
పెంట్లవెల్లి	8,718	8,357	-	17,075
మొత్తం	1,16,975	1,12,420	4	2,29,399

2014 ఎన్నికల్లో అభ్యర్థుల వారీగా పోలైన ఓట్లు

అభ్యర్థి	పార్టీ	వచ్చిన ఓట్లు
జూపల్లి కృష్ణారావు	బీఆర్‌ఎస్	72,741
బీరం హర్షవర్ధన్‌రెడ్డి	కాంగ్రెస్	62,243
కటికనేని మధుసూదన్‌రావు	బీజేపీ	5,348

మొత్తం ఓటర్లు : 2,08,275
పోలైన ఓట్లు : 1,54,115

2018 ఎన్నికల్లో అభ్యర్థుల వారీగా పోలైన ఓట్లు

అభ్యర్థి	పార్టీ	వచ్చిన ఓట్లు
బీరం హర్షవర్ధన్‌రెడ్డి	కాంగ్రెస్	80,617
జూపల్లి కృష్ణారావు	బీఆర్‌ఎస్	60,071
ఎల్లేని సుధాకర్‌రావు	బీజేపీ	13,156

మొత్తం ఓటర్లు : 2,08,941
పోలైన ఓట్లు : 1,72,846

పకడ్బందీగా ఎన్నికల నియమావళి అమలు



మహబూబ్‌నగర్‌లో మీడియా పాయింట్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ రవినాయక్ (ఫైల్)

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): అసెంబ్లీ ఎన్నికల ప్రచారం మొదలుకొని.. ఓట్ల లెక్కింపు వరకు కోడ్ అమల్లో ఉంటోంది. ఈ నేపథ్యంలో సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేల వెంట పరిగెత్తి వ్యవహారాలను చక్కబెట్టే అధికారుల కదలికలు, అభ్యర్థుల ప్రచార శైలిపై ప్రత్యేక నిఘా పెడుతున్నారు. ఇప్పటికే ప్రభుత్వ పథకాల పోస్టర్లు, ఫ్లెక్సీలను తొలగించారు. ఎన్నికల కోడ్ ముగిసే వరకు అభ్యర్థులతో పాటు అధికార యంత్రాంగం ఎన్నికల నిబంధనలను తప్పనిసరిగా పాటించాలి.

పాటించాల్సిన నిబంధనలు..

- అధికారంలో ఉన్న పార్టీలు ప్రచారంలో ప్రభుత్వ యంత్రాంగాన్ని ఉపయోగించకూడదు.
- అధికార పార్టీలు, కొత్త పథకాలు, ప్రాజెక్టులు, విధానాలను ప్రకటించకూడదు.
- ప్రభుత్వ ఖర్చులతో మీడియా ఇతర మాధ్యమాల్లో ప్రకటనలపై నిషేధం ఉంటుంది.
- మంత్రులు, నామినేటెడ్ పదవుల్లో ఉన్న వారు అధికార కార్యక్రమాల పేరిట ప్రచారం చేయకూడదు.
- ప్రభుత్వ వాహనాలు వినియోగించరాదు.
- సభల నిర్వహణకు మైదానాలు, హెలిప్యాడ్‌ల వినియోగంలో అన్ని పార్టీలకు ఒకే నిబంధన వర్తిస్తోంది.
- తాత్కాలిక నియామకాలు చేపట్టకూడదు.
- ఎన్నికల ప్రచారానికి వేదికలుగా ప్రార్థనా మందిరాలను ఉపయోగించకూడ దు.
- ఎన్నికలకు 48గంటల ముందు ఎలాంటి ప్రచారం చేయకూడదు.

తీసుకోవాల్సిన అనుమతులు

- రాజకీయ పార్టీల ప్రచార ప్రకటనలు, లౌడ్ స్పీకర్లను వినియోగించేందుకు ప్రత్యేకంగా అధికారుల అనుమతి తీసుకోవాలి.
- అభ్యర్థి ప్రచారానికి మూడు వాహనాలను మాత్రమే వినియోగించాలి. వీటికి సైతం ఎన్నికల అధికారి అనుమతి ఉండాలి.
- ఎన్నికల నిబంధనల ఉల్లంఘనకు సంబంధించి రాత్రి, పగలు తేడా లేకుండా ఎప్పుడైనా ఫిర్యాదు చేయవచ్చు.
- ప్రైవేటు స్థలాల్లో ప్రచారానికి యజమాని అనుమతి తీసుకోవాలి.
- ప్రచార ఖర్చుల వివరాలను ఎప్పటికప్పుడు ఎన్నికల అధికారులకు అందజేయాలి.
- ర్యాలీలు, ప్రచారం, సభలు, సమావేశాలను నిర్దేశిత సమయంలోగా ముగించాలి.

ఓట్ల పండగ.. మద్యం దండిగా

జిల్లాలో విచ్చలవిడిగా అక్రమ విక్రయాలు

- కొనసాగుతున్న పోలీసుల దాడులు
- కొత్తచెరువు రోడ్డు, తిమ్మసానిపల్లిలో అత్యధికంగా..
- పదిరోజుల్లో 308 బెల్టు దుకాణాలు మూసివేత..

రూ.11 లక్షల మద్యం సీజ్



కృష్ణాలో గోవా మద్యాన్ని పట్టుకున్న ఎక్సైజ్ పోలీసులు

మహబూబ్‌నగర్ క్రైం: ఎన్నికలు వస్తే చాలు.. గ్రామాల్లో మద్యం ఏరులై పారుతోంది. నాయకులు మద్యాన్ని ఎరచూపి ఓటర్లను ఆకర్షించే పనిలో ఉంటారు. అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన నాటి నుంచి గ్రామాల్లోని బెల్టు దుకాణాల్లో అధిక ధరలకు మద్యం విక్రయాలు నిర్వహిస్తున్నారు. పోలీసులతో పాటు ఎక్సైజ్ అధికారులు, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు దాడులు చేసి నిల్వ ఉంచిన మద్యాన్ని సీజ్ చేస్తున్నారు. జిల్లాలోని 441 గ్రామ పంచాయతీలతో పాటు తండాల్లోనూ బెల్టు దుకాణాలు కొనసాగుతున్నాయి. పెద్ద గ్రామాల్లోనైతే అయిదు నుంచి పది దుకాణాలు, చిన్న గ్రామాల్లో ఐదులోపు దుకాణాలు ఉంటున్నాయి. ఆయా దుకాణాల్లో నిరంతరం మద్యం అమ్మకాలు కొనసాగుతుంటాయి. ఓటర్లు, ఇతర పార్టీల కార్యకర్తలను ఇప్పటి నుంచే ప్రసన్నం చేసుకునేందుకు చాలామంది నేతలు మద్యం పంపిణీకి శ్రీకారం చుట్టారు. బెల్టు దుకాణాల నిర్వాహకులు భారీ మొత్తంలో మద్యం కొనుగోళ్లు జరిపి నిల్వ చేసుకుంటున్నారు.

■ ఎన్నికల షెడ్యూల్ వచ్చిన తర్వాత పోలీసులు బెల్టు దుకాణాలపై దాడులు నిర్వహించి 88 కేసులు నమోదు చేశారు. అదేవిధంగా 1,619.060 లీటర్ల మద్యం సీజ్ చేయగా దీని విలువ రూ.6,63,345 ఉంటుంది. ఇక ఎక్సైజ్ పోలీసులు ఈ నెల 9 నుంచి 21 వరకు 308 బెల్టు దుకాణాలు మూయించి కేసులు నమోదు చేశారు. అదేవిధంగా రూ.5,60,073 విలువజేసే 2,277.91 లీటర్ల మద్యం సీజ్ చేశారు.

కిరాణా దుకాణాలు.. టీ హోటళ్లు..

బెల్టు దుకాణాలు నిర్వహించొద్దని నిబంధనలున్నా.. పట్టణాలు, పల్లెల్లో ఉన్న కిరాణ దుకాణాలు, టీ హోటళ్లలో జోరుగా మద్యం విక్రయాలు కొనసాగుతున్నాయి. కొత్త చెరువు రోడ్‌లో ఉండే ఓ బెల్టు దుకాణంలో అర్ధరాత్రి కూడా మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం. అర్ధరాత్రి మద్యం తాగే యువతకు ఇది అడ్డాగా మారింది. అలాగే తిమ్మసానిపల్లి, కోయనగర్‌లోనూ భారీగా విక్రయాలు జరుగుతుంటాయి.

కేసులు నమోదు చేస్తాం..

ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున అక్రమంగా మద్యం విక్రయిస్తూ పట్టుబడిన వారిపై కేసులు నమోదు చేస్తాం. ఇప్పటికే దాబాలను మూయించాం. సెక్షన్ 109, 110 కింద నిర్వాహకులను తహసీల్దార్ ఎదుట హాజరుపర్చి రూ.లక్ష పూచీకత్తుతో బైండోవర్ చేశాం. ప్రత్యేక బృందాలు తనిఖీలు నిర్వహిస్తున్నాయి.

– సైదులు, ఈఎస్, మహబూబ్‌నగర్

మూతబడిన దాబాలు..

ఎన్నికల షెడ్యూల్ వెలువడిన వెంటనే ఎక్సైజ్ పోలీసులు దాబాలు మూయించారు. అయినా నిర్వాహకులు సాయంత్రం, రాత్రి వేళల్లో గోప్యంగా మద్యం విక్రయిస్తున్నారు. పాలమూరు శివారు ప్రాంతంతో పాటు బైపాస్, ఎదిర రోడ్డు, కోయిలకొండ రోడ్డు, దేవరకద్ర రోడ్డులో ఉన్న దాబాలు కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. ఎక్సైజ్ అధికారులు దాడులకు వెళ్లే సమయాల్లో సమాచారం తెలుసుకొని కాసేపు మూసేస్తున్నారు.

నాగం నిర్ణయం బాధాకరం

- ఆయన బీఆర్‌ఎస్‌లో చేరుతారని ఊహించలేదు
- టీపీసీసీ ఉపాధ్యక్షుడు మల్లు రవి



నాగర్‌కర్నూల్‌లో మాట్లాడుతున్న మల్లురవి

సాక్షి, నాగర్‌కర్నూల్: మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీని వీడటం బాధాకరమని టీపీసీసీ ఉపాధ్యక్షుడు మల్లు రవి అన్నారు. జిల్లాకేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ అవినీతి, అరాచక పాలనపై పోరాటం చేసిన ఆయన.. ఆ పార్టీలోనే చేరుతారని ఊహించలేదని తెలిపారు. ఇంతకాలం బీఆర్‌ఎస్‌పై చేసిన అవినీతి ఆరోపణలపై ప్రజలకు సమాధానం చెప్పాలని కోరారు. నాగర్‌కర్నూల్‌లో నల్లమట్టి దోపిడీపై లెక్కలతో సహా స్పష్టమైన ఆరోపణలు చేశారని, ఇప్పుడు వాటికి ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. ఈనెల 31న కొల్లాపూర్‌లో ప్రియాంకాగాంధీ హాజరయ్యే 'పాలమూరు ప్రజాగర్జన' భారీ బహిరంగ సభకు ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని మల్లురవి కోరారు.

కాంగ్రెస్‌ను మోసింది నేనే..: ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి

సుమారు 20ఏళ్ల పాటు కాంగ్రెస్ పార్టీని మోసింది తానేనని ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి అన్నారు. 1985 నుంచి 2018 దాకా మంచి, చెడులోనూ పార్టీలోనే కొనసాగానని, పార్టీ బలోపేతానికి శ్రమించానని చెప్పారు. 20 ఏళ్లకుపైగా టీడీపీలో కొనసాగిన నాగం.. 2018లోనే పారచూట్‌లా కాంగ్రెస్‌లో చేరారని అన్నారు. సమావేశంలో కాంగ్రెస్ అభ్యర్థి కూచుకుళ్ల రాజేశ్‌రెడ్డి, పీసీసీ ప్రధాన కార్యదర్శి కిశోర్‌రెడ్డి, ఎన్నికల పరిశీలకుడు పీవీ మోహన్, జెడ్పీటీసీ రోహిణి, సుమిత్ర, కోటయ్య, శ్రీనివాస్‌రెడ్డి, హబీబ్ ఉన్నారు.

సముచిత స్థానం కల్పిస్తామన్నాం..

జడ్చర్ల టౌన్: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే మాజీ ఎమ్మెల్యే ఎర్ర శేఖర్‌కు సముచిత స్థానం కల్పిస్తామని చెప్పామని టీపీసీసీ ఉపాధ్యక్షుడు మల్లురవి తెలిపారు. ఆదివారం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ నారాయణపేట అసెంబ్లీ స్థానం ఎర్రశేఖర్‌కు టికెట్ ఇవ్వాలని తనతోపాటు రాష్ట్ర అధినాయకత్వం భావించినప్పటికీ.. చివరి నిమిషంలో పార్టీ హైకమాండ్ తీసుకున్న నిర్ణయంతో ఆయనకు టికెట్ లభించలేదన్నారు. ఘర్‌వాపసిలో భాగంగా పార్టీ వీడిన నాయకులందరూ రావాలని పిలుపునిచ్చారు. అనంతరం కాంగ్రెస్ అభ్యర్థి జనంపల్లి అనిరుధ్‌రెడ్డి మాట్లాడుతూ తనకు టికెట్ కేటాయింపునకు కృషి చేసిన నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. అంతకుముందు పట్టణంలో ర్యాలీ నిర్వహించి, శ్రీకాంతాచారి, అంబేద్కర్, పూలే విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.


ప్రమాదంలో నుజ్జునుజ్జయిన బోగీలు


క్షతగాత్రుడిని ఆస్పత్రికి తరలిస్తున్న ఏపీ విపత్తు నిర్వహణ సిబ్బంది

రెండు రైళ్లు ఢీ..

విజయనగరం జిల్లాలో పెను ప్రమాదం..

సాక్షి ప్రతినిధి విజయనగరం/జామి/లక్కవరపుకోట/శృంగవరపు కోట/పెందుర్తి/సాక్షి, అమరావతి/కొవ్వూరు: విజయనగరం జిల్లాలో ఆదివారం రాత్రి ఘోర రైలు ప్రమాదం సంభవించింది. రెండు రైళ్లు బయల్దేరిన కొద్ది నిమిషాల వ్యవధిలో ఢీకొనడంతో ఈ ఘోరం జరిగింది. ఈ పెను ప్రమాదంలో 12 మంది మరణించగా.. 32 మందికి పైగా గాయపడ్డారు. వీరిని విశాఖపట్నం, విజయనగరం ప్రభుత్వాసుపత్రులకు తరలించారు. ఏం జరిగిందో అర్థమయ్యేలోపే కొన్ని బోగీలు నుజ్జునుజ్జయ్యాయి. దీంతో ఒక్కసారిగా అరుపులు, కేకలు, హాహాకారాలతో ఆ ప్రాంతం భయానకంగా మారింది. ఈ హృదయ విదారక ఘటన ఆదివారం రాత్రి జామి మండల పరిధిలో జరిగింది. ఈ దుర్ఘటనపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. హుటాహుటిన సహాయక చర్యలు చేపట్టాలని ఆయన అధికారులను ఆదేశించారు. వివరాలివీ..

విశాఖ నుంచి–పలాస వెళ్లే ప్యాసింజర్ రైలు ఆదివారం సా.6.25 గంటలకు కొత్తవలస రైల్వేస్టేషన్ నుంచి బయల్దేరింది. భీమాళి రైల్వేస్టేషన్ దాటిన తర్వాత అలమండ రైల్వేస్టేషన్ నుంచి సిగ్నల్ రాకపోవడంతో డ్రైవర్ రైలును నెమ్మదిగా నడుపుతున్నారు. అదే సమయంలో సా.6.40 గంటల ప్రాంతంలో రాయగడ పాసింజర్ కొత్తవలస నుంచి బయల్దేరింది. వేగంగా వస్తున్న రాయగడ పాసింజర్ అదే ట్రాక్‌పై ముందు వెళ్తున్న పలాస పాసింజర్ రైలును రాత్రి 7.10 గంటల సమయంలో వెనుక నుంచి భీమాళి–అలమండ రైల్వేస్టేషన్ల మధ్య ఢీకొట్టింది. దీంతో పలాస పాసింజర్ వెనుకనున్న రెండు బోగీలు, వాటిని ఢీకొన్న రాయగడ ప్యాసింజర్ రైలు ఇంజన్‌తో పాటూ మరో మూడు బోగీలు పలాస రైలు మీద పడి నుజ్జునుజ్జయ్యాయి. అదే సమయంలో కొన్ని బోగీలు పక్క ట్రాక్‌పై ఉన్న గూడ్స్ మీద పడ్డాయి. దీంతో పెను విషాదం అలముకుంది.

మృతులు 12 మంది..

ఈ ఘటనలో 12 మంది మృతిచెందినట్లు గుర్తించారు. వారి మృతదేహాలను బయటికి తీశారు. నుజ్జునుజ్జయిన బోగీల్లో మరిన్ని మృతదేహాలు ఉండే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. ఇక బోగీల్లో చిక్కుకున్న మృతదేహాలను వెలికి తీసేందుకు సహాయక చర్యలను ముమ్మరం చేశారు. మృతుల్లో ఒక లోకో పైలట్ ఉన్నట్లు సమాచారం. ఇప్పటికే 32 మంది క్షతగాత్రులను 20 అంబులెన్స్‌ల్లో విజయనగరం, విశాఖల్లో వేర్వేరు ఆస్పత్రులకు తరలించారు.

చీకట్లో సహాయక చర్యలు..

ఇక ప్రమాద స్థలిలో విద్యుత్ వైర్లు తెగిపోవటంతో పూర్తిగా చీకట్లు అలముకున్నాయి. దీంతో సహాయక చర్యలు కాస్త నెమ్మదిగా జరుగుతున్నాయి. రెండు రైళ్లలో మిగిలిన బోగీల్లో ఉన్న ప్రయాణికులు రోడ్డు మార్గంలో తమ గమ్యాలకు వెళ్లేందుకు సిద్ధమయ్యారు. ప్రస్తుతం దెబ్బతిన్న బోగీల్లో చిక్కుకున్న వారిని బయటికి తీసేందుకు స్థానికులు, రైల్వే, జిల్లా అధికార యంత్రాంగం, పోలీసులు, వైద్య సిబ్బంది తదితరులు అంతా సహాయక చర్యల్లో పాల్గొన్నారు.

హుటాహుటిన ప్రజాప్రతినిధులు, అధికారుల రాక

ప్రమాద ఘటన వార్త తెలుసుకున్న వెంటనే మంత్రి బొత్స సత్యనారాయణ, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్పీ ఎం.దీపికతో పాటూ పలువురు జిల్లా అధికారులు హుటాహుటిన సంఘటనా స్థలికి చేరుకుని సహాయక చర్యలను సమీక్షించారు. జిల్లా యంత్రాంగానికి మంత్రి బొత్స పలు సూచనలు చేశారు. ప్రస్తుతం ఘటనాస్థలిలో సహాయక చర్యలు ముమ్మరంగా సాగుతున్నాయి.

వైద్యశాఖ అప్రమత్తం..

ప్రమాద ఘటన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం వైద్యశాఖను పూర్తిస్థాయిలో అప్రమత్తం చేసింది. క్షతగాత్రులకు మెరుగైన వైద్యసేవలు అందించడానికి యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టింది. ప్రమాదం గురించి తెలిసిన కొద్ది నిమిషాల్లోనే అప్రమత్తమైన రాష్ట్ర ప్రభుత్వం 108 అంబులెన్సులను ఘటనా స్థలికి తరలించింది. విజయనగరం, అనకాపల్లి, విశాఖపట్నం, శ్రీకాకుళం జిల్లాల నుంచి 30 వరకూ 108 అంబులెన్సుల్లో క్షతగాత్రులను ఆస్పత్రులకు తరలించారు. తీవ్రంగా గాయపడిన వారిని విశాఖ కేజీహెచ్‌కు.. స్వల్పంగా గాయపడ్డ వారిని విజయనగరంతో పాటు, సమీపంలోని ప్రభుత్వాస్పత్రులకు తరలించారు. బాధితులకు వైద్య సహాయార్థం కేజీహెచ్‌లో 24/7 హెల్ప్‌లైన్ నెంబర్లను ఏర్పాటుచేశారు. మరోవైపు.. ప్రమాద స్థలంలోనే క్షతగాత్రులకు తక్షణ వైద్యం కోసం ప్రత్యేక వైద్య బృందాలను రంగంలోకి దించారు.

సీఎం జగన్ దిగ్భ్రాంతి

ఇక ఈ దుర్ఘటనపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. విశాఖ నుంచి రాయగడ వెళ్తున్న ప్యాసింజర్ రైలుకు ప్రమాదం జరిగినట్లుగా.. పలు బోగీలు పట్టాలు తప్పినట్లుగా ప్రాథమిక సమాచారం అందుతోందని సీఎంఓ అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. వెంటనే హుటాహుటిన సహాయక చర్యలు చేపట్టాలని ఆయన అధికారులను ఆదేశించారు. విజయనగరం సమీప జిల్లాలైన విశాఖపట్నం, అనకాపల్లి నుంచి వీలైనన్ని అంబులెన్సులను పంపించాలని, మంచి వైద్యం అందించడానికి సమీప ఆస్పత్రుల్లో అన్నిరకాల ఏర్పాట్లుచేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. వైద్య ఆరోగ్య, పోలీసు, రెవిన్యూ సహా ఇతర ప్రభుత్వ శాఖలు సమన్వయంతో వేగంగా సహాయక చర్యలు చేపట్టి, క్షతగాత్రులకు సత్వర వైద్యసేవలు అందేలా చూడాలన్నారు. ఘటనకు సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు తనకు నివేదించాలన్నారు. మరోవైపు.. దుర్ఘటనపై రాష్ట్ర హోం, విపత్తుల నివారణ శాఖ మంత్రి తానేటి వనిత కూడా దిగ్భ్రాంతి వ్యక్తంచేసి మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని, సంతాపాన్ని తెలిపారు. సహాయక చర్యలు కొనసాగుతున్నాయని 'సాక్షి'కి చెప్పారు.



ముఖ్యమంత్రికి రైల్వే మంత్రి ఫోన్

ఈ ప్రమాదంపై కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ సీఎం జగన్‌తో ఫోన్‌లో ఆదివారం రాత్రి మాట్లాడారు. ప్రమాదం జరిగిన వెంటనే తీసుకున్న చర్యలను సీఎం జగన్ ఆయనకు వివరించారు. సహాయ బృందాలను వెంటనే ఘటనా స్థలానికి పంపించామని, క్షతగాత్రులకు వైద్యం అందించేందుకు సత్వర చర్యలు తీసుకున్నామని చెప్పారు. జిల్లాకు చెందిన మంత్రి బొత్స సత్యన్నారాయణ, స్థానిక కలెక్టర్, ఎస్పీ అక్కడే ఉండి సహాయ కార్యక్రమాలను పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. క్షతగాత్రులకు సరైన వైద్యసేవలు అందించడంపై అధికారులు దృష్టిపెట్టారని, వీరిని సమీపంలో ఉన్న ఆస్పత్రులకు పంపిస్తున్నారని, ఆ మేరకు ఆయా ఆస్పత్రుల్లో అత్యాధునిక వైద్యసేవలు అందించేలా చర్యలు కూడా తీసుకున్నామని సీఎం కేంద్ర మంత్రికి చెప్పారు.

ఏపీ మృతులకు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా

విజయనగరం జిల్లాలో రైలు ప్రమాదంలో మృతుల కుటుంబాలతో పాటు, క్షతగాత్రులకు సీఎం జగన్ ప్రభుత్వం అండగా నిలిచింది. ఏపీకి చెందిన మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.10 లక్షలు, తీవ్రంగా గాయపడ్డ వారికి రూ.2 లక్షలు చొప్పున సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా ప్రకటించింది. రైలు ప్రమాద ఘటనలో మరణించిన వారి కుటుంబాలను ఆదుకునేందుకు అన్నిరకాల చర్యలు తీసుకోవాలని సీఎం అధికారులను ఆదేశించారు. మరణించిన వారిలో ఇతర రాష్ట్రాలకు చెందిన వారు ఉంటే బాధిత కుటుంబాలకు రూ.2 లక్షల చొప్పున, తీవ్రంగా గాయపడ్డ వారికి రూ.50వేల చొప్పున సహాయం అందించాలన్నారు.

ఏం జరిగిందో అర్థంకాలేదు..

పార్వతీపురంలోని మా ఇంటికి వెళ్లేందుకు పెందుర్తిలో రైలెక్కాను. సుమారు గంట తరువాత అకస్మాత్తుగా రైలు భారీ కుదుపునకు గురైంది. మా బోగిలో అందరూ చెల్లాచెదురైపోయారు. కాసేపు ఏం జరిగిందో అర్థంకాలేదు. తేరుకునేటప్పటికి నా కాలికి తీవ్ర గాయమైంది. మా అల్లుడు వచ్చి పెందుర్తి ఆసుపత్రిలో చికిత్స చేయించాడు.

– వరలక్ష్మి, ప్రమాదంలో గాయపడిన మహిళ

వెనుక నుంచి ఢీకొట్టడంవల్లే..

ప్రమాద ఘటనపై రైల్వేశాఖ ప్రాథమిక ఎఫ్ఐఆర్

రాత్రి 7 గంటలకు జరిగినట్లు నిర్ధారణ

10 నిమిషాల వ్యవధిలో కంటకాపల్లి నుంచి బయలుదేరిన రైళ్లు

సాక్షి, విశాఖపట్నం/విజయనగరం అర్బన్/రైల్వేస్టేషన్ (విజయవాడ పశ్చిమ): వాల్తేరు డివిజన్ పరిధిలోని విజయనగరం జిల్లా అలమండ సమీపంలో రైలు ప్రమాదం జరిగిన ప్రాంతం భీతావహంగా మారింది. ఈ ప్రమాదం ఎలా జరిగిందన్న దానిపై వాల్తేరు రైల్వే డివిజన్ అధికారులు ప్రాథమిక ఎఫ్ఐఆర్ సిద్ధంచేసి రైల్వే మంత్రిత్వ శాఖకు పంపించారు. ప్రమాదం ఎప్పుడు జరిగింది? ఏఏ రైళ్లు ప్రమాదానికి గురయ్యాయి? అనే ప్రాథమిక అంశాల్ని అందులో పొందుపరిచారు. ఈ ఎఫ్ఐఆర్ ప్రకారం వివరాలిలా ఉన్నాయి..

- **ప్రమాదం జరిగిన తీరు:** వెనుక నుంచి ఢీకొట్టడంవల్ల..
- **ప్రమాదం జరిగిన సమయం :** 29 అక్టోబరు రాత్రి 7 గంటలకు..
- **డివిజన్ :** వాల్తేరు రైల్వే డివిజన్
- **ఏ సెక్షన్‌లో జరిగింది :** కంటకాపల్లి–అలమండ డీఎన్ మిడిల్ లైన్‌లో
- **ప్రమాదం జరిగిన ప్రాంతం :** 840/27 కి.మీ వద్ద
- **ఏఏ రైళ్లు ప్రమాదానికి గురయ్యాయి :** 08532 ఎక్స్‌ప్రెస్, 08504 ఎక్స్‌ప్రెస్
- **సమీప స్టేషన్ నుంచి ఎప్పుడు బయలుదేరాయి :** 08532 ఎక్స్‌ప్రెస్ సా. 6.42 గంటలకు బయల్దేరింది.. 08504 ఎక్స్‌ప్రెస్ 6.52 గంటలకు బయలుదేరింది
- **ఇతర సమాచారం :** యాక్సిడెంట్ రిలీఫ్ మెడికల్ ఎక్విప్‌మెంట్ కోసం 7.05కి సమాచారం ఇచ్చారు
- 7.07 గంటలకు యాక్సిడెంట్ రిలీఫ్ ట్రైన్‌ను (ఏఆర్‌టీ) ఆర్డర్ చేయగా 7.31 గంటలకు విశాఖ నుంచి బయల్దేరింది.
- 7.10 గంటలకు 120 టన్నుల క్రేన్ బయల్దేరింది
- **సహాయక చర్యల్లో పాల్గొన్న అధికారులు :** వాల్తేరు డివిజన్ డీఆర్ఎం, ఏడీఆర్ఎం(ఆపరేషనల్), ఇతర అధికారులు

బాధితుల సమాచారం కోసం కంట్రోల్ రూం..

బాధితులకు సహాయం, వారి సమాచారం తెలుసుకోవడం కోసం కంట్రోల్ రూంలను ఏర్పాటుచేసినట్లు విజయనగరం జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి తెలిపారు.

కలెక్టరేట్ కార్యాలయంలో : 9493589157
రైల్వే శాఖలో : 89780 80006
రైల్వే కంట్రోల్ రూంలో : 8978080777
విశాఖ కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్: 9030226621, 7036111169, 0891 2590102

విజయవాడ డివిజన్ అధికారులు ప్రకటించిన హెల్ప్‌లైన్ నంబర్లు..
ఏలూరు : 0881-2232267
సామర్లకోట : 0884-2327010
రాజమహేంద్రవరం : 0883-2420541
తుని : 0885-4252172

రైలు ప్రమాదంపై ప్రధాని విచారం

మృతుల కుటుంబాలకు రూ.2 లక్షల పరిహారం

న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లో ఆదివారం రెండు రైళ్లు ఢీకొన్న ప్రమాదంలో ప్రాణ నష్టం జరగడం పట్ల ప్రధాని నరేంద్ర మోదీ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రధాని జాతీయ విపత్తుల సహాయ నిధి నుంచి రూ.రెండు లక్షల చొప్పున పరిహారాన్ని చెల్లించనున్నట్లు ప్రకటించారు. క్షత్రగాత్రులకు రూ.50,000 చొప్పున సహాయం అందించనున్నట్లు ప్రధాని కార్యాలయం తెలిపింది. తక్షణమే పరిస్థితిని సమీక్షించాలని రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌ను ప్రధాని ఆదేశించారు.

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

చేపల వేటకు వెళ్లి ఇద్దరు మృతి


మృతి చెందిన కృష్ణయ్య, వడ్డె బాల్‌రాజు

ధన్వాడ: మండలంలోని కిష్టాపూర్ గ్రామ పరిధిలోని రామసముద్రం చెరువులో పడి ఇద్దరు వ్యక్తులు మృతిచెందారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన కృష్ణయ్య(33), వడ్డె బాల్‌రాజు(35) శనివారం రాత్రి 10 గంటలకు చేపల వేటకు వెళ్లి, వారు తిరిగి ఇంటికి రాలేదు. దీంతో ఆదివారం ఉదయం కుటుంబ సభ్యులు చెరువు వద్దకు వెళ్లి పరిశీలించగా.. చేపల వలలో ఇరుక్కొని మృతిచెంది ఉన్నారు. గమనించిన కుటుంబ సభ్యులు బయటకు తీసుకొచ్చి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఇద్దరి మృతదేహాలను బయటకు తీసి పోస్టుమర్టం నిమిత్తం తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ రమేష్ తెలియజేశారు.

కన్నతల్లిని హతమార్చిన కుమారుడికి రిమాండ్



కల్వకుర్తి టౌన్: డబ్బుల కోసం కన్నతల్లిని హతమార్చిన కుమారుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు కల్వకుర్తి సీఐ ఆంజనేయులు తెలిపారు. సీఐ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. పట్టణంలోని విద్యానగర్ కాలనీకి చెందిన రమేష్ తాగుడుకు బానిసయ్యాడు. తాను పనిచేయగా వచ్చిన డబ్బులతో జల్సాలు చేసేవాడు. శనివారం మద్యం తాగేందుకు డబ్బులు లేకపోవడంతో తల్లి బంగారమ్మ (48)ను అడగగా, డబ్బులు లేవని చెప్పింది. దీంతో ఆగ్రహానికి గురైన రమేష్.. నడుముకు ఉన్న మొలతాడుతో తల్లి గొంతును బిగించి, భూమికి తలను బలంగా బాదడంతో అక్కడికక్కడే మృతి చెందింది. నిందితుడిని పట్టుకుని న్యాయమూర్తి ఎదుట హాజరుపర్చగా, రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. కేసు విచారణలో సహకరించిన ఎస్ఐ రమేష్, సిబ్బంది శ్రవణ్‌ను అభినందించారు.

అట్టహాసంగా..


- మూలమల్లలో ఆలిండియా ఇన్విటేషన్ కబడ్డీ పోటీలు ప్రారంభం
- పాల్గొన్న మూడు రాష్ట్రాల జట్లు


కబడ్డీ పోటీలను ప్రారంభిస్తున్న స్థలదాతలు


పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

ఆత్మకూర్: వనపర్తి జిల్లా ఆత్మకూర్ మండలం మూలమల్లలో ఆదివారం ఆలిండియా ఇన్విటేషన్ కబడ్డీ పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. గ్రామానికి చెందిన దేశాయి పద్మజా వెంకటేశ్వర్‌రెడ్డి, వనజా గోవర్ధన్‌రెడ్డి రూ.18లక్షలు విలువజేసే ఎకరన్నర భూమిని కబడ్డీ క్రీడాప్రాంగణం నిమిత్తం దానం చేశారు. పాండురంగస్వామి సప్తాంగం, వాల్మీకి మహర్షి జయంతి సందర్భంగా దాతల సహకారంతో ఆలిండియా ఇన్విటేషన్ కబడ్డీ పోటీలు ఏర్పాటు చేయగా.. కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి 10 జట్లు తరలొచ్చాయి. పోటీలు రెండు రోజుల పాటు కొనసాగనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. విజేత జట్టుకు రూ.50వేలు, రెండవ బహుమతి రూ.40వేలు, మూడవ బహుమతి రూ.30వేలు, నాల్గో బహుమతి రూ.20వేలు, ఐదో బహుమతి రూ.12వేలు, ఆరో బహుమతి రూ.10వేలు, ఏడో బహుమతి రూ.8వేలు, 8వ బహుమతి రూ.6వేలు నగదుతోపాటు షీల్డ్‌లను ప్రదానం చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సీఐ రత్నం, ఎస్ఐ నరేందర్, సర్పంచ్ ప్రశాంతి, ఎంపీటీసీ శ్యామల, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ వేణుగోపాల్‌రెడ్డి, కబడ్డీ సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రాము, ఆనంద్‌గౌడ్, భీమన్న, రఘునాథ్‌రెడ్డి, లక్ష్మీకాంత్‌రెడ్డి, ప్రవీణ్, రాములు, వినయ్‌రెడ్డి పాల్గొన్నారు.

జూరాలకు 2వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో



ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఆదివారం రాత్రి 7గంటల వరకు 2వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైనట్లు పీజేపీ అధికారులు తెలిపారు. ఆవిరి రూపంలో 120, ఎడమ కాల్వకు 920, కుడి కాల్వకు 731, ఆర్డీఎస్ లింక్ కెనాల్‌కు 300, సమాంతర కాల్వకు 850, భీమా లిఫ్ట్–2కు 750 క్యూసెక్కులతో కలిపి మొత్తం 2,621 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 9.657 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 6.539 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు తెలిపారు.

శ్రీశైలంలో 844.8 అడుగుల నీటిమట్టం..

దోమలపెంట: శ్రీశైలం జలాశయంలో ఆదివారం 844.8 అడుగుల వద్ద 69.7540 టీఎంసీల నీటి నిల్వ ఉంది. 24 గంటల వ్యవధిలో మల్యాల ఎత్తిపోతల నుంచి హెచ్ఎన్ఎస్ఎస్‌కు 1,556, ముచ్చుమర్రి నుంచి కేసీ కెనాల్‌కు 369, రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజీకేఎల్ఐకి 2,400 క్యూసెక్కుల నీటిని వదిలారు. భూగర్భ కేంద్రంలో 0.270 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేసి, 511 క్యూసెక్కుల నీటిని సాగర్‌కు వదిలారు. జలాశయంలో 182 క్యూసెక్కుల నీరు ఆవిరైంది.

న్యాయం చేయండి


ఇంటి స్థలాల్లో కర్రలు పాతుతున్న లబ్ధిదారులు

నవాబుపేట: మండలంలోని కారుకొండలో 15ఏళ్ల కిందట ఇచ్చిన ప్లాట్ల భూమి తమదని పేర్కొంటూ కొందరు లాక్కుంటున్నారని, తమకు న్యాయం చేయాలని గ్రామస్తులు కోరారు. ఆదివారం ఇంటి స్థలాల్లో కర్రలు పాతి హద్దులను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ 15 ఏళ్ల కిందట కారుకొండకు చెందిన రాజేష్‌తో పాటు మరికొందరు సర్వే నంబర్–1లోగల రెండెకరాల భూమిని ప్రభుత్వానికి విక్రయించగా, తమకు ఇంటి స్థలాలను కేటాయించినట్లు తెలిపారు. ప్రస్తుతం ధరణిలో గత యజమానుల పేరుపైనే భూమి ఉండటం, పట్టాదారు పాస్‌పుస్తకంలోనూ వారి పేర్లు ఉన్నాయని.. వారు కోర్టుకు వెళ్లడంతో అనుకూలంగా తీర్పు వచ్చిందన్నారు. ఈ క్రమంలోనే సంబంధిత భూమిలో కర్రలను పాతి కబ్జా చేస్తున్నారని పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు వాపోయారు. ఈ విషయంపై సంబంధిత అధికారులు విచారణ జరిపి న్యాయం చేయాలని గ్రామస్తులు కోరారు.

కురుమూర్తి స్వామి ఆలయంలో కొండచిలువ

చిన్నచింతకుంట: మండలంలోని అమ్మాపురం కురుమూర్తి స్వామి ఆలయం గర్భగుడిలోకి కొండచిలువ దూరింది. చంద్రగ్రహణం సందర్భంగా శనివారం సాయంత్రం పూజారులు ఆలయాన్ని మూసివేశారు. ఆదివారం ఉదయం స్వామివారికి సంప్రోక్షణ నిర్వహించేందుకు పూజారులు ఆలయాన్ని తెరిచారు. తెరిచిన వెంటనే ఆరు అడుగుల కొండచిలువ కనిపించింది. దీంతో ఆలయ సిబ్బంది, అమ్మాపురం గ్రామస్తులు కర్రలతో కొండచిలువను కొట్టి చంపేశారు. అనంతరం పూజారులు స్వామివారికి సంప్రోక్షణ కార్యక్రమం నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు.


కురుమూర్తి స్వామి ఆలయంలో దూరిన కొండచిలువ

తెరుచుకున్న ఆలయాలు

జోగుళాంబ శక్తిపీఠం: అలంపూర్ జోగుళాంబ బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయాలు ఆదివారం ఉదయం తెరుచుకున్నాయి. చంద్రగ్రహణం సందర్భంగా శనివారం సాయంత్రం 5 గంటలకు మూసివేయగా ఆదివారం ఉదయం 6 గంటలకు తెరిచి శుద్ధి కార్యక్రమాలు నిర్వహించారు. అర్చకులు పుణ్యాహవాచనం, మహా సంప్రోక్షణ, మంగళ నీరాజనాలు అందజేసి 9 నుంచి భక్తులను దర్శనానికి అనుమతించారు.


ఆలయంలో సంప్రోక్షణ చేస్తున్న అర్చకులు

మైసమ్మ దేవతకు బంగారు కడియం

నవాబుపేట: జిల్లా కేంద్రంలోని వెంకటేశ్వర కాలనీకి చెందిన సర్వోత్తంకుమార్ ఆదివారం నవాబుపేట మండలంలోని పర్వతాపూర్ మైసమ్మ దేవతను దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం అమ్మవారికి 10 గ్రాముల బంగారు కడియం కానుకగా అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు సర్వోత్తంకుమార్‌ను ఘనంగా సన్మానించారు.


బంగారు కడియం అందజేస్తున్న సర్వోత్తంకుమార్

వ్యక్తి ఆత్మహత్య

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలం పెద్దదిన్నెకు చెందిన బొగ్గు నర్సింహ (40) ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్ఐ అశోక్‌బాబు తెలిపారు. ఎస్ఐ వివరాల మేరకు.. డ్రైవర్‌గా పనిచేసే నర్సింహ మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో శనివారం కుటుంబ సభ్యులు మందలించడంతో మనస్తాపానికి గురైన అతడు.. ఇంట్లో నుంచి బయటికి వెళ్లి గ్రామ సమీపంలో పురుగుల మందు తాగాడు. గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో చికిత్స నిమిత్తం గద్వాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి డాక్టర్ల సూచన మేరకు ఆదివారం కర్నూల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా, మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతుడి భార్య గోవిందమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

కల్తీ కల్లు తాగి పలువురికి అస్వస్థత


ఆత్మకూర్ ఆస్పత్రిలో బాధితులతో మాట్లాడుతున్న ఎక్సైజ్ అధికారులు

- పిన్నంచర్లలో ఘటన

ఆత్మకూర్: కల్తీ కల్లు తాగి పలువురు తీవ్ర అస్వస్థతకు గురైన సంఘటన ఆత్మకూర్ మండలంలోని పిన్నంచర్లలో చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కూలి పనులు చేసుకుని రోజు సాయంత్రం కల్లు తాగి సేదతీరే దినసరి కూలీలు ఎప్పటిలాగే ఆదివారం కల్లు తాగగా.. అస్వస్థతకు గురయ్యారు. గ్రామానికి చెందిన లక్ష్మి, చంద్రశేఖర్, గొల్లలక్ష్మి, కవిత, జయమ్మ, హన్మంతు, శాంతమ్మ, ఖాజమ్మ, పద్మ, శారద తదితరులు అస్వస్థతకు గురవ్వడంతో ఆత్మకూర్‌లోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం వనపర్తి జిల్లా ఆస్పత్రికి మెరుగైన చికిత్స నిమిత్తం తరలించారు. కాగా ఖాజమ్మ పరిస్థితి విషమంగా ఉన్నట్లు గ్రామస్తులు తెలిపారు. కాళ్లు, చేతులు పనిచేయకపోవడం, మూతి వంకర అవ్వడం, మాటలు రాకపోవడం లాంటి సమస్యలతో బాధపడుతున్నారని అన్నారు. ఈ విషయమై ఆస్పత్రిని సందర్శించి బాధితులతో వివరాలు సేకరించామని, పిన్నంచర్లలో విక్రయించిన కల్లు శాంపిల్ సేకరించామని ఎక్సైజ్ శాఖ సీఐ బాలరాజు, ఎస్ఐ వెంకటేష్‌గౌడ్ అన్నారు. ఉన్నతస్థాయి అధికారులకు సమాచారం అందించామని, వైద్యుల రిపోర్ట్ ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని వివరించారు.